

వారాహి జ్యుయలరీ ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఆనంద ఇన్ ఫంక్షన్ హాల్లో వారాహి జ్యుయలరి ప్రదర్శనను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) శనివారం ప్రారంభించారు. ఆభరణాలను ఎంతో ఇష్టంగా మహిళలు ఆదరిస్తారని, ఆకర్షణీయమైన ఆభరణాల ప్రదర్శనను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వారాహి జ్యుయలరి క్లస్టర్ మేనేజర్ అనంత్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ లాలయ్య మాట్లాడుతూ రెండురోజులపాటు భీమవరంలో ఈ ఆభరణాల ప్రదర్శన అందుబాటులో ఉంటుందని, వారాహి జ్యుయలరి మూడు బ్రాంచిలు హైదరాబాద్, విజయవాడ, తిరుపతిలో ఉన్నాయని, త్వరలో భీమవరంలో కూడా ప్రారంభిస్తామని అన్నారు. ఈ రెండు రోజులపాటు జరిగే ఆభరణాల ప్రదర్శనలో గ్రాము బంగారంపై 150 తగ్గింపు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనే లక్ష్యం..



ఏడాది పాలనపై చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్

జిల్లాలో మొట్టమొదటిగా ఎంఎస్ఎంఇ పార్క్ నియోజకవర్గంలోనే ఏర్పాటు

ఏడాదిలో సంక్షేమానికి రూ.170 కోట్లు, అభివృద్ధికి రూ.180 కోట్లు ఖర్చు

వచ్చే అక్టోబర్ నాటికి చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రి పూర్తి

ప్రజా సమస్యలపై ప్రతి శుక్రవారం ఉదయమూ గ్రీవెన్స్, రాత్రి పల్లెనిద్ర

చింతలపూడి ఎత్తిపోతల రైతులకు మేలు చేసేలా ముందుకు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చింతపూడి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి ఇక్కడి ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరంగా అనేక చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎంఎల్ఎగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వివరించారు. ఏడాది పాలనలో నియోజకవర్గంలో సంక్షేమానికి, అభివృద్ధికి ఎంత ఖర్చుపెట్టింది, రోడ్ల పనులకు నిధులు ఎన్ని వచ్చాయి, దేవాలయాలు, ఇరిగేషన్‌కు పనులకు సంబంధించి ఏవిధమైన పనులు జరిగాయి, పరిశ్రమల ఏర్పాటుకు చేస్తున్న కృషి, చింతలపూడి నగర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, చింతలపూడి ఎత్తిపోతల పథకం రైతులకు న్యాయం జరిగేవిధంగా ఏవిధంగా ముందుకు సాగుతున్నారో ఆయన వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపు అందుకుని వారంలో ఒకరోజు పల్లెనిద్ర, గ్రీవెన్స్ నిర్వహిస్తుండడం వంటి అనేక అంశాలను ఎంఎల్ఎ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ప్రశ్న : ఎంఎల్ఎగా ఏడాది పాలన పూర్తిచేసుకున్నారు, ఈ కాలంలో ఏవిధంగా పాలన ముందుకు సాగింది?

ఎంఎల్ఎ: ఏడాది పాలన సంతృప్తికరంగా సాగింది. ఈ కాలంలో రూ.170 కోట్లు సంక్షేమానికి, రూ.180 కోట్లు అభివృద్ధికి ఖర్చు చేయడం జరిగింది. చింతలపూడి నగరంలో రూ.50 కోట్లతో ఇంటర్నల్ రోడ్లు, చెరువులు బాగుచేత, డ్రెయినేజీ, తాగునీటి పనులకు సంబంధించి ఖర్చు చేయడం జరిగింది. జంగారెడ్డిగూడెంలో రూ.42 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చుచేశాం. ఎన్ఆర్ఇజిఎస్ కింద రూ.25 కోట్లు సీసీ రోడ్లుకు ఖర్చుచేయడం జరిగింది. ఎన్ఆర్ఇజిఎస్ రెండో విడతగా మరో రూ. ఆరుకోట్లు నిధులు రానున్నాయి. నాబార్డ్ నిధులు రూ.25 కోట్లతో జలపావారిగూడెం, జీలకర్రమెట్ట ఇతర రోడ్ల పనులు జరుగుతున్నాయి. చింతలపూడి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశాం. ఆర్అండ్‌బి రోడ్లకు రూ.50 కోట్ల నిధులు ఖర్చు చేయనున్నాం. సి కేటగిరి బెండర్లు సైతం పూర్తయ్యాయి. సింఎఆర్ఎఫ్ (సిఎం రిలీఫ్ ఫండ్) కింద రూ.4 కోట్లు అందించాం. నవోదయం-2 పేరుతో సారా నిషేధం విజయవంతంగా సాగుతోంది.

ప్రశ్న : చింతలపూడి ప్రజల చిరకాల కోరిక వంద పడకల ఆసుపత్రి పనులు ఎక్కడి వరకూ వచ్చాయి?

ఎంఎల్ఎ : ఈ ఏడాదిలో రూ.నాలుగు కోట్ల నిధులు ఆసుపత్రి పనులకు మంజూరు చేయడం జరిగింది. మరో 20 శాతం పనులు మాత్రమే ఉన్నాయి. వచ్చే సెప్టెంబర్, అక్టోబర్‌కు పూర్తిచేస్తాం. త్వరలోనే ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : ఇరిగేషన్ పనులకు సంబంధించి నిధులు ఖర్చు పెట్టారా?

ఎంఎల్ఎ : ఇరిగేషన్ సెక్టార్‌లో ఒఅండ్ఎం పనుల కింద రూ.2 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. కామవరపుకోట, చింతలపూడి ఇతర ప్రాంతాల్లో దేవాలయాల అభివృద్ధికి రూ.రెండు కోట్లు వచ్చాయి. వ్యవసాయానికి తొమ్మిది గంటలు, గృహాలకు 24 గంటల విద్యుత్ అందించేలా ఆర్‌డిఎస్ నిధులు రూ.270 పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 25 శాతం పూర్తయ్యాయి.

ప్రశ్న : లోఓల్టేజీ సమస్య పరిష్కరించేందుకు విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఏమైనా చర్యలు తీసుకున్నారా?

ఎంఎల్ఎ : కొత్తగా ఆరు సబ్‌స్టేషన్ ఏర్పాట్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు వచ్చాక పనులు ప్రారంభించడం జరుగుతోంది. తడికలపూడిలో సూర్యఘర్ ఏర్పాటు జరుగుతోంది.

ప్రశ్న: పరిశ్రమల ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంఎల్ఎ: జిల్లాలో మొట్టమొదటిగా చింతలపూడి నియోజకవర్గంలో 70 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ (మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్) పార్క్ ఏర్పాటు చేయడం జరిగింది. మెట్ట ప్రాంతంలో కోకో పంటను ఎక్కువగా రైతులు పండిస్తున్నారు. కోకో సంబంధించి ఆది నుంచి చివరి వరకూ ప్రోసెసింగ్ పనులు ఇక్కడే జరిగేలా పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయి. ఇంకా అనేక పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

ప్రశ్న: సంక్షేమ హాస్టల్స్‌పై ఏమైనా దృష్టి సారించారా?

ఎంఎల్ఎ : సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి సంబంధించిన రూ.రెండున్నర కోట్లు ఖర్చుపెడుతున్నాం. చింతలపూడి గురుకుల పాఠశాలలో సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: చింతలపూడి ఎత్తిపోతల పథకం ఎప్పటికి పూర్తవుతుంది. భూములిచ్చిన రైతులకు న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకున్నారా?

ఎంఎల్ఎ : రెండున్నర ఏళ్లలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. చింతలపూడి పథకంపై ఎన్‌జిటిలో కేసు ఉండడంతో ఇబ్బంది ఉంది. భూములిచ్చిన రైతులకు న్యాయం జరిగేవిధంగా అన్ని చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: జంగారెడ్డిగూడెంలో బైనేరు వాగుపై వంతెన నిర్మాణం పరిస్థితి ఏమిటి?

ఎంఎల్ఎ : నియోజకవర్గంలో మొత్తం మూడు వంతెనల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నాం. కక్షలపాలెం, పట్టిన పాలెం, బైనేరుపై వంతెన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాం.

ప్రశ్న : ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఏ విధంగా ముందుకు సాగుతున్నారు?

ఎంఎల్ఎ : ప్రతి శుక్రవారం కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించి ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం. ఆదేరోజు రాత్రి గ్రామంలో పల్లె నిద్ర చేస్తున్నాం. సిఎం చంద్రబాబు పిలుపును అందుకుని ప్రజల వద్దకు వెళ్తున్నాం. ఇప్పటికే నాలుగు పల్లె నిద్రలు చేశాం. జనాలకు మరింత చేరువయ్యేలా ముందుకు సాగుతాం.

ప్రశ్న : కూటమి నేతల సహకారం ఏవిధంగా ఉంది?

ఎంఎల్ఎ : కూటమి నేతల సహకారం అన్నివిధాలా బాగుంది. ఎటువంటి ఇబ్బందీ లేదు. అందరం కలిసి అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేలా పనిచేస్తున్నాం.

'తల్లికి వందనం'లో కోత.. ప్రజలకు వాత..!

రూ.15 వేలు ఇస్తామని రూ.13 వేలు అందిస్తూ మోసం చేస్తున్న ప్రభుత్వం

పథకం అమల్లో సవాలక్ష నిబంధనలు

పాఠశాల అభివృద్ధి పేరిట రూ.2 వేలు మినహాయింపు

వైసిపి ప్రభుత్వం విధానాలే కూటమి కొనసాగింపు

ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు అని గొప్పలు చెప్పిన కూటమి ప్రభుత్వం తల్లికి వందనంలో కోతలు పెట్టడంతో సార్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందించే అరకొర సొమ్ముకు కూడా సవాలక్ష నిబంధనలు విధించి అర్హులను అనర్హులుగా గుర్తిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లి వెత్తుతున్నాయి. పిల్లల చదువులకు తల్లికి వందనం సాయం ఆసరాగా ఉంటుందని భావించిన తల్లిదండ్రులకు నిరాశే ఎదురైంది. ఫీజులు, పుస్తకాలు, విద్యా సామగ్రికి వేల రూపాయలు చెల్లించలేక ఆందోళన చెందుతున్నారు. చెప్పిన దానికి చేస్తున్న దానికి పొంతన లేకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజానీకం గుర్రుగా ఉన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల్లో తల్లికివందనం ప్రధానమైంది. ఈ పథకం అమలుపై ఏడాదిగా అనేక అనుమానాలు వ్యక్తమైనప్పటికీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పండుగలో భాగంగా ఎట్టకేలకు ఈ పథకాన్ని తెరపైకి తీసుకొచ్చి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. అయితే ఈ పథకం తల్లులకు అక్కరకు చేరకుండా సవాలక్ష నిబంధనలు విధించింది. గత వైసిపి ప్రభుత్వం అమ్మఒడికి పెట్టిన నిబంధనలకు మించి కూటమి ప్రభుత్వం మరికొన్ని జోడించి అర్హులను తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో వైసిపి, సిపిఎంతో పాటు విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,76,574 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 1,16,182 తల్లులకు దీనికి సంబంధించి ఆర్థిక సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అర్హుల జాబితాలను సచివాలయాలకు విడుదల చేశారు. వీటిపై అభ్యంతరాలుంటే ఈ నెల 26వ తేదీలోపు సచివాలయాల విద్యా కార్యదర్శులకు తెలియజేయొచ్చు. శుక్రవారం, శనివారం బ్యాంకుల వారీగా పలు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమైనట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో పాఠశాలలు తెరిచేనాటికి రూ.15 వేలు చొప్పున ఎంతమంది పిల్లలుంటే అందరికీ జమ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. గత ప్రభుత్వం అమ్మఒడికి అమలు చేసిన నిబంధనలే కూటమి ప్రభుత్వం కూడా అమలు చేసేలా ఆదేశాలిచ్చింది. ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఒక ఖాతాకు నిధులు కేటాయిస్తూ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసేందుకు పలు మార్గదర్శకాలను రూపొందిస్తూ జిఒ 26ను ప్రభుత్వం విడుదల చేసింది. 2020 జనవరిలో ఒక్కో విద్యార్థికి రూ.14 వేలు, ఆ తర్వాత మూడేళ్లు రూ.13 వేలు చొప్పున ఇవ్వగా కూటమి ప్రభుత్వం దీన్నే ప్రమాణికంగా తీసుకుని ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు జమ చేసేందుకు ఉత్తర్వులిచ్చింది. కేటాయించిన రూ.15 వేలల్లో రూ.2 వేలు పాఠశాల అభివృద్ధి పేరిట కోత విధించారు. అయితే జాబితాలో అర్హులను అనర్హులుగా చూపించారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. అయితే ప్రయివేటు విద్యాసంస్థల్లో లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ అభివృద్ధి పేరుతో అక్కడ కూడా రూ.2 వేలు కోత విధించడం పట్ల విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. ఫీజుల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల రక్తం పీల్చుతున్న ప్రయివేట్ విద్యాసంస్థలకు ఇది వర్తించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే స్కీం వర్కర్లు, కాంటాక్టు కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సైతం తల్లికి వందనం వర్తించకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సవా లక్ష నిబంధనలతో సతమతం..

ప్రస్తుత విద్యా సంవత్సరంలో 75 శాతం హాజరు ఉన్న వారికి వచ్చే విద్యా సంవత్సరంలో ఈ పథకానికి అర్హులుగా పరిగణిస్తారు. రేషన్ కార్డు ఉండాలి. ప్రిన్సిపల్స్, హెచ్ఎంలు విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. కుటుంబ ఆదాయం నెలకు గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించి ఉండరాదు. పట్టణాల్లో 1000 చదరపు అడుగులకు మించిన విస్తీర్ణంలో ఇల్లు ఉండకూడదు. విద్యా హక్కు చట్టం కింద ప్రయివేటు స్కూళ్లలో అడ్మిషన్లు పొందిన వారికి సొమ్ము పూర్తిగా ఇవ్వరు. ఆయా స్కూళ్ల మేనేజ్‌మెంట్లకు చెల్లించాల్సిన ఫీజులు ఈ సొమ్ము నుంచి మినహాయించి, మిగతావి లబ్ధిదారుల తల్లులకు అందజేస్తారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద పోస్ట్, ప్రీ స్కాలర్‌షిప్‌లు పొందుతున్న వారికి స్కాలర్‌షిప్ అమౌంట్ పోను మిగతావి ఇస్తారు. ఫోర్ వీలర్ ఉండకూడదు. టాక్సీ, ఆటో, ట్రాక్టర్లను మినహాయించారు. కరెంట్ వినియోగం 300 యూనిట్లకు మించరాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులకు, పది వేలకు పైన పెన్షన్ వచ్చే వారికి పథకం వర్తించదు. ఈ నిబంధన నుంచి మున్సిపల్ వర్కర్లను మినహాయించారు. ఈ నిబంధనలతో తల్లిదండ్రులు సతమతమవుతున్నారు.



వేల కుటుంబాలకు అన్యాయం..

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి, భీమవరం

అడ్డగోలు నిబంధనల కారణంగా వేల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ పథకాన్ని ఇవ్వాలి. ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతిలో చేరే వారికి, ఇంటర్ పూర్తయిన వారికి తల్లికి వందనం నగదు చెల్లించాలి. స్కీమ్ వర్కర్లు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలి.రూ.15 వేలు నేరుగా తల్లులకు చెల్లిస్తామని ఇప్పుడు రూ.2000 మినహాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సరికాదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్న కుటుంబంలో విద్యార్థులకు ఈ పథకం అమలు కాకుండా మినహాయించడం హామీని ఉల్లంఘించడమే. ప్రయివేటు పాఠశాలల్లో లక్షల రూపాయలు ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. ప్రతి విద్యార్థికీ కోత లేకుండా రూ.15 వేలు అందించాలి.

జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తాం..

టి.ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, భీమవరం



ఎన్నికల్లో ప్రతి విద్యార్థికీ రూ.15 వేల ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుతం పాఠశాల అభివృద్ధి పేరుతో రూ.2 వేల కోత పెట్టి పేద మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసింది. ఇన్ని నిబంధనలు విధిస్తే అర్హుల కంటే అనర్హులే ఎక్కువగా ఉంటారు. కొంతమందికైతే సాంకేతిక సమస్యలని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఎలాంటి షరతులూ లేకుండా తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేసి రూ.15 వేలు ఇవ్వాలి. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తాం.

జిల్లాలో పలుచోట్ల వర్షం



రహదారిపై నిలిచిన వర్షం నీరు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో శనివారం తెల్లవారుజాము నుంచి ఉరుములతో కూడిన తేలికపాటి వర్షం పడింది. వర్షం కారణంగా పలుమార్లు విద్యుత్ నిలిపి వేశారు. మున్సిపాల్టీ ఇటీవల డ్రెయిన్లలో తీసిన సిల్టు తిరిగి డ్రెయిన్లోకే వెళ్తోంది. నియోజకవర్గంలో కూడా పంట కాలువలు, డ్రెయిన్లలో కోట్ల రూపాయల ఖర్చుతో సిల్ట్ తీస్తున్నారు. తీసిన సిట్లు కాలువలోకి వెళ్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొగల్తూరు : శనివారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ప్రజలు విలవిల్లాడారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో అధిక ఉష్ణోగ్రతల నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. భారీ వర్షంతో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. మండలంలోని గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేదు. దీంతో రహదారిపైనే నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పేరుపాలెం, కెపి.పాలెం, రామన్నపాలెం, వారతిప్ప, ముత్యాలపల్లి, శేరేపాలెం, జగన్నాధపురం, మొగల్తూరులోని కోటరోడ్డు, భీమవరం వెంప రహదారి, తదితర గ్రామాల్లోని రహదారులపై వర్షపునీరు నిలిచిపోయింది.

తొలి అడుగులోనే ఇన్ని షరతులా..

ప్రభుత్వం అర్హులందరికీ 'తల్లికి వందనం' అమలు చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో అమలు చేస్తున్న 'తల్లికి వందనం' తొలి అడుగులోనే ఇన్ని షరతులు పెట్టడం అన్యాయమని, అర్హులైన ప్రతి కుటుంబానికీ తల్లికి వందనం వర్తింపజేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బలరాం మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు మొబైల్ రీఛార్జ్ చేసుకున్నట్లే చేసుకోవాలని దీనివల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ మీటర్ల ఖరీదు అంతా ప్రజలపైనే పడే అవకాశం ఉందన్నారు. 15 - 20 సంవత్సరాల కాలంలో రూ.3 లక్షల కోట్లు ప్రజలపై పడుతుందనే అంచనా ఉందని, ఎన్నికల్లో లోకేష్ చెప్పినట్లు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలనే పిలుపును అమలుచేయాలని తెలిపారు. పట్టణాల్లో పన్నుల భారాలు విపరీతంగా పెంచుతున్నారన్నారు. తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. తల్లికి వందనం బాగా కుదించడం తగదన్నారు. చిరు ఉద్యోగులకు కూడా ఈ స్కీమును అమలు చేయాలన్నారు. రూ.2 వేలు అభివృద్ధి పేరుతో కట్ చేయడం అన్యాయమన్నారు. జిల్లాలో ఉపాధి కూలీల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ధాన్యం బకాయిలను కూడా వెంటనే రైతులకు చెల్లించాలన్నారు. వర్షాకాలం ప్రారంభంలో ముంపు సమస్యలు లేకుండా కలవాలని, పంట కాలువలను బాగుచేసి మురుగునీరు వెళ్లేలా చేయాలని తెలిపారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికి అమలుచేకపోవడం దారుణమన్నారు. అన్నదాత సుఖీభవ వాస్తవ కౌలు దారులకు ఇవ్వాలన్నారు. జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి కుటుంబానికీ 3 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డుల ప్రక్రియ వేగవంతం చేయడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. ఉపాధి పనులు చూపడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పేరుపాలెం నార్త్ ఉప్పుటేరులో వేటకు వెళ్లి మతి చెందిన మత్స్య కారుడు తిరుమాని రామకృష్ణ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

యోగాతో ఆరోగ్యం : కలెక్టర్

ప్రజాశక్తి - కాళ్ల

భారతీయ సంస్కృతిలో సాంప్రదాయంగా వస్తున్న వ్యవస్థల్లో యోగా ఒకటని, యోగాతోనే ఆరోగ్యమని ఎపి డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరం గ్రామంలో రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్లో యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షణ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏఇతర రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో నెల రోజుల పాటు పెద్ద ఎత్తున యోగా శిక్షణ నిర్వహిస్తుందన్నారు. ఈనెల 21వ తేదీన విశాఖలో 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' వేడుకలు ప్రపంచస్థాయిలో జరపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రణాళికలు చేస్తున్నారన్నారు. భారతదేశంలో యోగా అంటే ఆంధ్రప్రదేశ్ గుర్తొచ్చేలా 'యోగాంధ్ర-2025'ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా యోగా విశిష్టతపై అవగాహన కల్పించారు. నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, జెసి రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిఎస్‌పి జయసూర్య, జనసేన మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు పాల్గొని యోగాసనాలు వేశారు. ప్రభుత్వాధికారులు, కూటమి నాయకులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కలెక్టర్ నాగరాణి

తాగునీరు కలుషితం

ఆక్వా చెరువులపై చర్యలు తీసుకోవాలి

పెర్కిపాలెంలో కార్యదర్శికి వినతి అందజేసిన గ్రామస్తులు

ప్రజాశక్తి - వీరవాసరం

పెర్కిపాలెం పంచాయితీ తాగునీటి చెరువు కలుషితానికి కారణమవుతున్న రొయ్యల చెరువులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు పంచాయితీ అధికారి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా రొయ్యల చెరువు కలుషిత వ్యర్థాల నీటిని పంట కాలువలోకి వదలడం, అదేనీరు పక్కనే తాగునీటి చెరువులోకి చేరడం సర్వసాధారణంగా జరుగుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం అనేక సార్లు అధికారులకు నిరసనల ద్వారా, వినతి పత్రాల ద్వారా, ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా తెలియజేసినప్పటికీ ఇప్పటి వరకూ ఏ విధమైన చర్యలు తీసుకోకపోవడం ప్రజల ఆరోగ్యం పట్ల అధికారుల తీరు ఏ విధంగా ఉందో అర్థమవుతుందన్నారు. నిబంధలకు విరద్ధంగా రొయ్యల చెరువులకు అనుమతులు ఏ విధంగా ఇచ్చారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే తాగునీరు చెరువు కలుషితానికి కారణమవుతూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న చెరువు యజమానులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొర్రా ఆలమహారాజు, బొక్కా కూర్మారావు, కె.గంగాభవాని పాల్గొన్నారు.



పెర్కిపాలెంలో కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఒకే నెలలో 2 సూపర్ సిక్స్ పథకాలు అమలు : మంత్రి



నిర్మాణంలో ఉన్న మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

ఒకే నెలలో 2 సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిన ఘనత సిఎం చంద్రబాబుదని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మంత్రి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గత 2 రోజులుగా పండుగ వాతావరణం కనిపిస్తోందని తల్లికి వందనం అకౌంట్లలో వేయడమే కారణమన్నారు. మరో 15 రోజుల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని కేంద్రం సహాయంతో ప్రతి రైతు అకౌంట్లో రూ.20 వేలు వేస్తామని చెప్పారు. ఆర్థిక స్థితి బాగోకపోయిన ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాలను అమలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. రాష్ట్రంలో తల్లికి వందనం కార్యక్రమం కింద 67 లక్షల మందికి అకౌంట్లో వేయగా గతంలో జగన్ 42 లక్షల మందికి మాత్రమే వేశారని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగున్నప్పుడు కూడా కేవలం ఇంటికి ఒక్కరికే జగన్ ఇచ్చారని, అయితే జగన్ కన్నా 25 లక్షల మందికి ఎక్కువగా ఈ పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. జగన్ సొంత పులివెందుల నియోజకవర్గంలో కూడా ఒక మహిళకు అయిదుగురు పిల్లలుంటే రూ.65 వేలు ఇచ్చినట్లు చెప్పారు. పవన్ కళ్యాణ్, మోడీల ప్రోత్సాహంతో రాజధాని అమరావతిలో నిర్మాణాలు చేస్తూ, పోలవరం పూర్తిచేస్తూ, పరిశ్రమలు నెలకొల్పుతూ అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే అభివృద్ధితో పాటు అన్న క్యాంటీన్, పెన్షన్, డిఎస్‌సి నోటిఫికేషన్ ఇలా సంక్షేమ కార్యక్రమాలు కూడా అమలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. అంతకుముందు మంత్రి ఎల్అండ్‌టి గృహాలను, అక్కడ నిర్మిస్తున్న వంతెన, ప్రభుత్వ ఆసుపత్రి, రామగుండం పార్క్, అబ్దుల్ కలాం పార్క్, హిందువుల శ్మశాన వాటికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారధి, ఇంజనీర్ రాజకుమార్, కూటమి నేతలు పాల్గొన్నారు.

గుండెపోటుతో సిపిఎం కార్యకర్త మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

ఉత్తరపాలెంలో సిపిఎం కార్యకర్త నున్నబోయిన సత్యనారాయణ(75) ఉపాధి పనికి వెళ్లి పనిప్రాంతంలో గుండెపోటుతో మృతిచెందాడు. ఇతనికి భార్య పుష్పవతి, ముగ్గురు ఆడపిల్లలు, ఒకరు మగ బిడ్డ సంతానం ఉన్నారు. ఇరవై సంవత్సరాల నుంచి ఈయన సిపిఎం కార్యకర్తగా సేవలందిస్తున్నారు. అనేక ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఎప్పటిలానే ఉదయం ఉపాధి పనికి వెళ్లి అక్కడే గుండెపోటు రావడంతో తక్షణమే తోటి కూలీలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రికి తీసుకెళ్లేలోపే అతని ప్రాణం విడిచినట్టు వైద్యులు నిర్థారించారు. సత్యనారాయణ మృతదేహంపై సిపిఎం సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి, సాంబియామి పార్టీ జెండా కప్పి జోహార్లు అర్పించారు. సత్యనారాయణ మృతిపట్ల కిలాడి సత్యనారాయణ, లింగం సత్యనారాయణ, యాళ్లబండి నారాయణమూర్తి, కేతా జ్యోతిబసు, పాలా కోటేశ్వరావు, అయినపూడి బాబురావు, మైగాపుల త్రిమూర్తులు సంతాపం వ్యక్తం చేశారు.



జెండా కప్పుతున్న సిపిఎం నాయకులు

పూర్తిస్థాయి డాక్టర్లను నియమించరూ..!

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలకేంద్రమైన పెనుమంట్రలోని పిహెచ్‌సి ప్రస్తుతం ఇన్‌ఛార్జి డాక్టర్‌తో నడుస్తుంది. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లలో ఒకరు ఉన్నత విద్య కోసం ప్రభుత్వ అనుమతితో లాంగ్ లీవ్ పెట్టి వెళ్లిపోయారు. కాగా రెండో డాక్టర్ ఆక్స్‌ఫర్డ్‌లో ఉద్యోగం వచ్చి ఇక్కడ జాబ్‌కు రాజీనామా ఇచ్చి గత నెల చివరిలో వెళ్లడంతో ఇక్కడ రెండు వైద్యాధికారుల పోస్టులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం మండలంలోని ఆలమూరు పిహెచ్‌సిలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యుల్లో ఒకరు ఇక్కడ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. నిత్యం ఎక్కువ మంది తమ వైద్య అవసరాలకోసం వచ్చే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు పూర్తి స్థాయి డాక్టర్లను నియమించాలని స్థానికులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కోరుతున్నారు.

నేటి నుంచి ఆకాశం హాస్పిటల్స్ సేవలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు తాడేపల్లిగూడెం, అమలాపురం, రాజమండ్రి పట్టణాల్లో ఉన్న ఆకాశం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి జులై 15 వరకు ఒక నెల రోజులు వివిధ వ్యాధులకు సేవలు ఉచితంగా అందించడం జరుగుతుందని సంస్థ ప్రతినిధి డాక్టర్ కె.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో మొదటిసారిగా మరెక్కడా లేని విధంగా అన్ని రకాల సర్జరీలు, మోకాళ్ల మార్పిడి, వెన్నుపూస సర్జరీ వంటివి పూర్తి ఉచితంగా చేస్తారని అన్నారు. మందులు, రక్తపరీక్షలు, మత్తు, ఇంప్లాంట్‌లకు అత్యల్ప ఖర్చుతో ఈ సేవలు అందుతాయని, పాత రిపోర్ట్‌లతో రావాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 9948178934 వాట్సాప్ నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు

ఎస్ఐ మహ్మద్ నసీరుల్లా

ప్రజాశక్తి - ఉండి

బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఉండి ఎస్ఐ మహ్మద్ నసీరుల్లా తెలిపారు. ఉండి పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

వైసిపి నేతల వ్యాఖ్యలు బాధాకరం

తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వైసిపి నేతలు, వారి సొంత మీడియా ప్రేరేపిత వ్యక్తులు ఆంధ్రుల కలల రాజధాని అమరావతిపై, మన మహిళలపై చేస్తున్న అవమానకర వ్యాఖ్యలు, జుగుప్సాకరమైన వ్యాఖ్యానాలతో తీవ్ర మానసిక క్షోభకు గురయ్యామని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. ఆమె అధ్యక్షతన భీమవరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం కూటమి మహిళ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కొమ్మినేని సుప్రీంకోర్టులో కండిషన్ బెయిల్ మంజూరైన దానిపై జగన్ సత్యమేవ జయతే అని కామెంట్ పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి డ్వాక్రా, అంగన్వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అమరావతి రాజధాని ప్రతిష్టను, ఔన్నత్యాన్ని మంటగలుపుతూ కొనసాగిస్తున్న వైసిపి ఉన్మాదులను న్యాయపరంగా అత్యంత కఠినంగా శిక్షించాలని కోరుతున్నామన్నారు. టిడిపి రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి మాదాసు కనకదుర్గ మాట్లాడుతూ మహిళల ఆత్మ అభిమానాన్ని, గౌరవాన్ని పరిరక్షించుకోవడానికి, రాజధాని, రాష్ట్ర అభివృద్ధి పరిరక్షణకు రాష్ట్రంలోని మహిళలందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జనసేన వీర మహిళ అధికార ప్రతినిధి బండారు శ్యామల మాట్లాడుతూ ఎపి మహిళలంటే జగన్‌కి ఎటువంటి గౌరవం లేదని, సొంత తల్లిని, చెల్లిని గెంటేసినోడికి మహిళల ఆత్మగౌరవం విలువ ఏం తెలుస్తుందని ప్రశ్నించారు. జనసేన వీర మహిళలు, ఎంపిటిసి ఇందిర, వార్డ్ మెంబర్ అండి ఆకుల మౌనిక, టిడిపి మహిళా జిల్లా ఉపాధ్యక్షురాలు సయ్యద్ నసీమా బేగం, టిడిపి కూటమి మహిళా నాయకులు పాల్గొన్నారు.

యోగాకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి : జెసి

ప్రజాశక్తి - మొగల్తూరు

యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా యోగ నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేయాలని జెసి రాహుల్ కుమార్ రెడ్డి సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని కేపీ పాలెం బీచ్‌లో ఉన్న రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి ఆలయం సమీపంలో ఈనెల 16వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించనున్న యోగ స్థలాన్ని ఆయన సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేయాలని అన్నారు. యోగా వేదిక ఏర్పాటు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌డిఒ దాసిరాజు, భీమవరం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిఎస్‌పి శ్రీవేద అరవింద్, తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని, ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్ ఉన్నారు.

భీమవరం టౌన్ : నిరంతర యోగాతో సంపూర్ణ ఆయుష్షు అని, యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని భీమవరం వన్ టౌన్ సిఐ నాగరాజు అన్నారు. కెజిఆర్‌ఎల్ కళాశాల యాజమాన్యం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఐ నాగరాజు మాట్లాడుతూ స్పీడ్ యుగంలో మానవులు అనేక ఒత్తిడులకు గురికావడం, తద్వారా అంతుపట్టని వ్యాధులు రావడం వంటి ఇబ్బందులు వస్తూ ఉంటాయని, దీనికి పరిష్కారం యోగా చేయడం తప్ప మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో కలిగోట్ల గోపాలశర్మ, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.శ్రీరామచంద్రమూర్తి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.గంగాధరరావు, పిజి డైరెక్టర్ తోట శ్రీరామ్మూర్తి, కవల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సినీనటుడు అల్లం గోపాలరావు మృతి సంతాపం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సినీ నటుడు అల్లం గోపాలరావు మృతికి సిపిఐ జిల్లా సమితి తీవ్ర సంతాపం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ గోపాలరావు తొలినాళ్లలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్యమండలిలో ప్రముఖ పాత్ర నిర్వహించారన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన గోపాలరావు సమాజంలో మంచి మార్పుకు ఎనలేని కృషి నిర్వహించారన్నారు. సామాజిక రుగ్మతలు రూపుమాపేందుకు, సమాజంలో చైతన్యం నింపేందుకు ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి తనవంతు కృషి నిర్వహించిన గొప్ప అభ్యుదయవాది గోపాలరావు అన్నారు.

రాయితీపై యంత్ర పరికరాల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

లక్ష్మణేశ్వరం గ్రామంలో సహాయ వ్యవసాయ ఎడిఎ అనిల్ కుమారి అధ్యక్షతన ఏరువాక పౌర్ణమి, రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా వ్యవసాయ యంత్రపరికరాలు రాయితీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొని పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ముందుగా రైతులకు ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేసి ఏరువాక పౌర్ణమి ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఏరువాక పౌర్ణమి రైతులకు సంబంధించిన అతి పెద్ద పండుగ అని తొలకరి జల్లుల ఆగమనంలో రైతులు ఆనందోత్సాహాల మధ్య అరక దున్నడం మొదలు పెడతారని, దీన్ని రైతులు సాంప్రదాయబద్ధంగా జరుపుకుంటారని తెలియజేశారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని వివిధ గ్రామాలలో రైతులకు రాయితీపై కృషి ట్రాక్టర్లు, రోటావెటరులు, లెవెలింగ్ బ్లేడ్‌లు, పవర్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు 33 మందికి గాను రూ.14 లక్షల 32 వేల 810 విలువగల వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు సబ్సిడీపై రైతులకు అందజేశారు. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ సంబంధించి రైతుల ఖాతాలకు త్వరలో రైతు కుటుంబానికి ఒక్కింటికి రూ.20 వేల చొప్పున రైతుల ఖాతాలో త్వరలో జమ చేయడం జరుగుతుందని, కావున రైతులందరూ ఈకెవైసి తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలలో చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు, మాజీ శాసన మండలి ఛైర్మన్ గౌరవ ఎం.ఎ.షరీఫ్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జిల్లా నీటి సంఘం ప్రాజెక్ట్ వైస్ ఛైర్మన్ గుబ్బల మారాజు, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, మైల వసంతరావు, కొల్లు పెద్దిరాజు, వాతాడి కనకరాజు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నరసాపురం: మండలంలోని యర్రంశెట్టివారి పాలెం గ్రామం శివారు ప్రాంతంలో శనివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసినట్లు నరసాపురం రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేశ్ తెలిపారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,900 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

సాగర తీరం.. విషాద భరితం..!

ప్రమాదాలకు నిలయంగా పేరుపాలెం బీచ్

ఇటీవల కాలంలో పలువురు యువకులు మృతి

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - మొగల్తూరు

జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని సుమారు 19 కిలోమీటర్ల మేర సముద్రతీరం విస్తరించి ఉంది. మొగల్తూరు మండలంలోని పేరుపాలెం సౌత్, కేపీపాలెం సౌత్ గ్రామాల్లో సుమారు పది కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. దీంతో ప్రకృతి ప్రేమికులు సేదతీరేందుకు, కార్తీకమాసం, శుభశుక్రవారం తదితర పుణ్యదినాల్లో సముద్ర స్నానం చేసేందుకు వేలాది మంది భక్తులు తీరానికి తరలివస్తుంటారు. ముఖ్యంగా వీకెండ్స్‌లో సరదాగా సేద తీరడానికి వస్తున్న వారిలో కొందరు ఆనందంగా వెనుతిరుగుతుంటే.. కొందరు కొండంత బాధ మోసుకెళుతున్నారు.



ప్రమాదకరంగా అలలు..

ఈ ప్రాంతంలో అలలు ప్రమాదకరంగా ఉంటాయి. సముద్ర ఆటు పోటులకు అలల ఉధృతి ప్రవాహం దిశ మారుతూ ఉంటుంది. దీంతో ఈ ప్రాంతంలో అలలు ఏ సమయంలో ఉధృతంగా ఉంటాయో.. ఏ సమయంలో ప్రశాంతంగా ఉంటాయో అంచనా వేయడం కష్టం. వందల సంఖ్యలో బీచ్‌కు పర్యాటకుల రాక సుమారు ఇరవై ఏళ్లనుంచి ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ పోలీసు రికార్డుల ప్రకారం 250 మందిపైబడి మృతిచెందారు. పోలీసు రికార్డులకు చిక్కని మృతిచెందిన సంఘటనలు చాలానే ఉంటాయని ప్రజలు చెబుతున్నారు.

రక్షణ చర్యలు శూన్యం..

బీచ్‌లో పర్యాటకుల రక్షణకు చేపట్టిన చర్యలు శూన్యం. ఇక్కడకు మద్యం సేవించి వచ్చేవారిని కట్టడి దిశగా చర్యలు లేవు. బీచ్‌లో గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్నారు. కళ్లెదుటే కొట్టుకుపోతున్న వారిని చూసి బోరున విలపించడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. కనీసం వారికి అందించేందుకు ఒడ్డున తాడు, ఇతర సాధనాలు లేవు. అక్కడ పోలీసు కంట్రోలు రూము ఏర్పాటు చేసినా అది అలంకార ప్రాయంగానే మిగిలింది.

పేరుపాలెం తీరంలో మృత్యుఘోష..

పేరుపాలెంబీచ్‌లో ఈమధ్యకాలంలో ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు. కేపీపాలెం నార్త్‌కు చెందిన యువకుడు, ఏప్రియల్ 19న నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలేనికి చెందిన యువకుడు, గతనెల 4న యలమంచిలి మండలం అబ్బిరాజు పాలేనికి చెందిన విద్యార్థి ప్రమాదవశాత్తు మునిగి మృత్యువాత పడ్డారు. తూర్పుతాళ్ళుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి రెండేళ్లకిందట తన మిత్రులతో కలిసి బీచ్‌కు వచ్చారు. సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తు మునిగి లోనికి కొట్టుకువెళ్లి మృత్యువాత పడ్డారు. రామన్నపాలేనికి చెందిన మిత్రులు ఏడాది కిందట బీచ్‌కు వెళ్లి సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ ప్రమాదవశాత్తూ అలల ఉధృతికి మునిగి ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు.

ఏలూరు జిల్లా కలిదిండికి చెందిన మంతెన భానుప్రసాద్ భీమవరానికి చెందిన మిత్రులతో కలిసి సుమారు ఐదేళ్లకింద బీచ్‌కు వచ్చి సముద్ర అలల్లో స్నానాలు చేస్తూ మునిగి మృత్యువాత పడ్డారు. గత మే నెలలో దేవరపల్లి మండలం చిన్నాయగూడెంకు చెందిన యువకుడు ప్రమాదవశాత్తు అలలతో అక్కడికి లోపలకు కొట్టుకు వెళ్లి గల్లంతయ్యాడు. నరసాపురం గ్రామీణ మండలం పిఎం లంకలో అయింది.

బీచ్‌లో మృతిచెందిన వారిలో యువకులే అధికం. విహారయాత్రలకనో, మిత్రులతో కలిసి సరదాకో బీచ్‌లో సేద తీరడానికి వస్తున్న విద్యార్థులు, యువకులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. అలల ఉధృతికి కొట్టుకుపోయి కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. ఒక్కసారిగా వస్తున్న అలల ఉధృతికి కొట్టుకుపోయి ఎక్కడో శవమై తేలుతున్నారు. ప్రమాదకర, లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక సూచికలు పెట్టి ప్రజలకు అవగాహన కల్పించి, ప్రమాదాలను నివారించాలి. బీచ్‌లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం

జి.వాసు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, మొగల్తూరు

బీచ్‌లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. పర్యాటకులకు తెలిసేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. సిబ్బందిని నియమించి ప్రమాదాలు జరగకుండా నివారిస్తాం.

దుర్గారావు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గుండాబత్తుల కనకదుర్గారావు మృతి ఆయన కుటుంబానికి, కార్మిక ఉద్యమానికి తీరని లోటని సిపిఎం రాష్ట్ర నాయకులు బి.బలరాం అన్నారు. శనివారం సాయంత్రం గుండాబత్తుల కనక దుర్గారావు కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా బి.బలరాం మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం సిఐటియు చేసిన ఉద్యమాలలో కనక దుర్గారావు చురుకుగా పాల్గొనే వారని అటువంటి వ్యక్తి మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలియజేశారు. కనకదుర్గారావు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఏడిద వెంకటేశ్వరరావు, రణస్థుల మహంకాళి, అంగర సాయి, సూరవరపు వెంకటాచార్యులు, పేరిచర్ల సూర్యనారాయణ రాజు, కరిమెరక మల్లికార్జున, అంగర రాంబాబు, పాటూరి శ్రీనివాస దొరబాబు, బులుసు రామకృష్ణ ఉన్నారు.



అన్న సమారాధనలో వడ్డిస్తున్న విప్ నాయకర్

బండి ముత్యాలమ్మ సన్నిధిలో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మికత భావం కలిగి ఉండాలని విప్ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారన్నారు. అమ్మవారిని దర్శించుకోటానికి వచ్చిన యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామంలోని అన్ని సామాజిక తరగతులు కలిసి అమ్మవారిని గ్రామంలో ఊరేగించి జాతర మహోత్సవాన్ని విజయవంతం చేశారన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను ఆయన ప్రారంభించి యాత్రికులకు భోజనాలు వడ్డించారు. ముందుగా నాయకర్‌ను ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్‌కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

నరసాపురం : మండలంలోని వేములదీవి వెస్ట్ కాపులకొడపలో వేంచేసి ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామికి శనివారం సందర్భంగా మామిడికాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. వేకువజాము నుంచే భక్తులు దర్శనానికి తరలివచ్చారు. కాలినడకన వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

సిఎం సహాయ నిధి అందజేత

పాలకొల్లు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మానవత్వంతో పనిచేస్తుందని, పేద బడుగు బలహీన వర్గాలకు వైద్యసాయంగా పెద్ద ఎత్తున సిఎం సహాయ నిధిని అందిస్తున్నామని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులోని ఆయన కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని ముగ్గురుకు వైద్యసాయంగా సిఎం సహాయ నిధి నుంచి ఎల్‌ఒసిలు రూ.18.50 లక్షలు కూటమి నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో వారం వారం సిఎం సహాయనిధిగా లక్షల్లో వైద్యసాయంగా అందిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. మంత్రి రామానాయుడుకు వైద్య సాయం పొందిన ముగ్గురు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు గండేటి వెంకటేశ్వరరావు, వల్లభు శ్రీనివాస్, తమ్మినీడి సత్యనారాయణ, పొట్నూరి శ్రీనివాస్, మల్లంపల్లి బాబు, గాదె వెంకన్న పాల్గొన్నారు.

'తల్లికి వందనం' దేశ చరిత్రలో నిలిచిపోతుంది

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ



తణుకు : మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ ఆరిమిల్లి

ప్రజాశక్తి - తణుకు

గత అయిదేళ్లలో రాష్ట్రాన్ని జగన్‌మోహన్ రెడ్డి ఆర్థికంగా నిర్వీర్యం చేసినప్పటికీ వాటన్నింటినీ అధిగమించి గత ప్రభుత్వం మిగిల్చిన గాయాల భారాన్ని కూడా లెక్క చేయకుండా అభివృద్ధి, సంక్షేమాన్ని చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలనే సంకల్పంతో మొదటి ఏడాదిలోనే రెట్టింపు సంక్షేమం, పరిపాలనతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముందుకు వెళుతున్నారన్నారు. శనివారం తణుకు స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్‌ఎ రాధాకృష్ణ మాట్లాడుతూ కేవలం ఒకే సంక్షేమ పథకానికి రూ.8,745 కోట్లు చెల్లించిన పథకంగా తల్లికి వందనం దేశంలో చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి కూటమి ప్రభుత్వం ప్రజల పట్ల ఉన్న బాధ్యతను నిరూపించడం జరిగిందన్నారు. అనంతరం తల్లికి వందనం ద్వారా ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు బ్యాంకు ఖాతాల్లో జమైన తల్లులు ఎంఎల్‌ఎ రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలుచోట్ల పాలాభిషేకం..

మొగల్తూరు : కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందిచ్చిన హామీలను అమలు చేస్తుందని టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా తల్లికి వందన కార్యక్రమం అమలు చేసిందన్నారు. మొగల్తూరులో తల్లికి వందనం కార్యక్రమం అమలు చేసినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌లకు శనివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కైల సుబ్బారావు, కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్ బాబు, బోనం నరసింహారావు, బొల్లా చంటి, పాల రాంబాబు, పితాని రాజు, ముక్కు పుల్లయ్య, బల్ల శ్రీను, పొన్నపల్లి శివ, వెలిది పుల్లారావు, కవురు నాగేశ్వరరావు ఉన్నారు.

ఆకివీడు : విద్యార్థులకు తల్లికి వందనం పేరుతో నిధులు విడుదల చేయడంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆనందంలో ఉన్నారు. ఈమేరకు వారి ఆనందానికి గుర్తుగా స్థానిక టిడిపి నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి స్థానిక హై డాక్టర్ సందు వద్ద పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.

స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు కృషి

జిల్లా కలెక్టర్ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించి ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నాగరాణి ఎంటర్ పెన్యూర్ యాక్షన్ ప్లాన్ అమలుపై మెప్మా అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. పట్టణ ప్రాంతాలలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం అనేక స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యానికి అనువైన యూనిట్లు స్థాపించి ఆర్థికంగా పురోగతి సాధించాలన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యులకు కొత్తగా బ్యాంకు లింకేజీ ద్వారా జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఉన్న యూనిట్‌లను విస్తరించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ గూగుల్ మీట్లో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రియంవద, ఎఒ హెబ్సిబా, జీవనోపాధి నిపుణులు సిహెచ్.నానిబాబు, జిల్లాలోని మున్సిపల్ కార్యాలయాల సిటీ మిషన్ మేనేజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రాలో పాలిసెట్ కౌన్సెలింగ్ సెంటర్



స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్ కళాశాల

నరసాపురం : స్వర్ణాంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యామండలి ఉత్తర్వులను జారీచేసినట్లు కళాశాల ఛైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్మయి విలేకరుల సమావేశంలో తెలియజేశారు. పాలిసెట్-25లో ర్యాంకులు సాధించిన విద్యార్థులందరూ ఈనెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రోజుకు 15 వేల ర్యాంకుల వరకూ సర్టిఫికేట్ వెరిఫికేషన్ అవుతుందని, ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వెరిఫికేషన్ ర్యాంకు ప్రకారం జరుగుతుందని తెలియజేశారు. ఆప్షన్స్ 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పెట్టుకోవచ్చని తెలియజేసారు. జూలై 7న అలాట్మెంట్ లిస్టు వస్తుందని అలా సీటు కేటాయించబడిన విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ వస్తుందని తెలియజేశారు. విద్యార్థులు దూరప్రయాణం చేయాల్సిన అవసరం లేకుండా దగ్గరలో నివశించేవారికి సాంకేతిక విద్యామండలి ఈ సదవకాశం కల్పించారని, ఈ సదుపాయాన్ని పాలిసెట్లో అర్హత సాధించిన చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. మరిన్ని వివరాలకు పాలిటెక్నిక్ కళాశాలలో సిబ్బందిని సంప్రదించవలసిందిగా తెలియజేశారు. 2023 నుంచి పాలిసెట్ పరీక్ష స్వర్ణాంధ్రా పాలిటెక్నిక్ కాలేజి, సీతారామపురం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు.

వెంకట రాయుడును కలిసిన జయసరిత

పాలకొల్లు రూరల్ : భీమవరం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జిగా నియమితులైన చినమిల్లి వెంకట రాయుడును శనివారం వైసిపి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయ సరిత భీమవరంలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్ ఉన్నారు.

కేంద్ర సాధికారత కమిటీ రాక

సమైక్యతతో సమస్యను వివరిద్దాం

రాష్ట్ర చేపల రైతుల అసోసియేషన్ అధ్యక్షులు నంబూరి రామరాజు

ఆకివీడు : కేంద్ర ప్రభుత్వం కొల్లేరులో 20 వేల ఎకరాల భూమిని కాంటూరు పరిధి నుంచి తొలగించడానికి జాతీయ వన్యప్రాణి బోర్డు స్థాయి సంఘం కమిటీకి సిఫార్సు చేసిందని రాష్ట్ర చేపల రైతు అసోసియేషన్ అధ్యక్షులు నంబూరి వెంకటరామరాజు, ఇతర నాయకులు వివరించారు. సుప్రీంకోర్టు నియమించిన ఈ కమిటీ ఈ సిఫార్సుల మేరకు ఇక్కడ పరిస్థితులను, సమస్యను పరిశీలించేందుకు గాను అతి త్వరలో ఈ ప్రాంతానికి రానున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా చర్చించేందుకు శనివారం మండలంలోని దుంపగడప వివి.గిరి డిగ్రీ కళాశాల అసోసియేషన్ హాల్లో చేపల రైతుల సంఘ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ప్రాంతానికి రానున్న సాధికారత కమిటీకి రైతులు, ఈ ప్రాంత వాసులు సమైక్యంగా తమ సమస్యలను వివరించాలని, అందరం కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. పార్టీలకతీతంగా అందరం కలిసి ఇక్కడ సమస్యలను వారికి వివరిద్దామన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రైతుల ఆవేదనను, విజ్ఞాపనలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ముదావహం అన్నారు. ఈ కమిటీకి యదార్థ పరిస్థితిని, సమస్యలను వివరించి వారిని సంతృప్తి పరచగలిగితే సుప్రీంకోర్టుకు ఈ విషయాన్ని వారు తెలియజేస్తారన్నారు. ఆ మేరకు సుప్రీంకోర్టు తీర్పు మన సమస్యల నుంచి గట్టెక్కించేందుకు అనుకూలంగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వన్యప్రాణి సంరక్షణ, అభయారణ్య చట్టం, చిత్తడి నేలల రక్షణ చట్టం, కాంటూర్ సమస్యల నుంచి బయటపడే అవకాశం దొరుకుతుందన్నారు. 9 మండలాల్లో విస్తరించి ఉన్న 15 వేల ఎకరాల సమస్య ఒక కొలిక్కి వస్తుందన్నారు. రాష్ట్ర రైతు సంఘ నాయకులు నాగ సత్య గంగాధర రావు, కొట్టు ఆంజనేయులు, కొల్లేటి రైతు నాయకులు భూపతి రాజు తిమ్మరాజు పాల్గొన్నారు.

రాంగోపాల్ మృతికి నివాళి

పాలకొల్లు : కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పాలకొల్లుకు చెందిన కుంపట్ల రామ్‌గోపాల్ అంత్యక్రియలు శనివారం సాయంత్రం పాలకొల్లులో జరిగాయి. మంత్రి రామానాయుడు తహశీల్దార్ కార్యాలయం వద్ద మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మారుతి థియేటర్ వద్ద ఉన్న బోళ్ల వారి లేఅవుట్ నుంచి భారీ ఊరేగింపుతో ఆయన అంతిమ యాత్ర పట్టణంలో జరిగింది. ఆయన ప్రయాణిస్తున్న కారులో స్వల్పంగా గాయపడిన కుమార్తె, కుమారుడు తండ్రికి విషాదంతో వీడ్కోలు పలుకుతున్న దృశ్యాలు అక్కడ గుమికూడిన ప్రజల కంటికి కన్నీరు తెప్పించింది. అంత్యక్రియల్లో ఆయన భార్య రీతు భర్తను ఆఖరి చూపు చూడ్డానికి అవకాశం లేని స్థితిలో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో విషమ పరిస్థితిలో ఉంది. ఇటువంటి పరిస్థితి ఏ కుటుంబంలో రాకూడదని ఆయన గృహం వద్ద పలువురు కన్నీరుమున్నీరయ్యారు. కాగా ఆయన అంత్యక్రియలు పూర్తయిన కొద్దిసేపటికి రాంగోపాల్ భార్య నీతూ కూడా మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఆదివారం పాలకొల్లు తీసుకొస్తున్నారు.